మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

**పాపన్నపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
కుళ్లిపోయిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని ఓ మహిళా శవాన్ని (అందాజ 55ఏండ్ల వరకు వయసు) గుర్తించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం...ఏడుపాయల పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో ఆరెంజ్ రంగు డబ్బాలు గల చీర, ముఉదరు నీలం రంగు జాకెట్లు ధరించి ఉన్న మహిళా శవాన్ని గుర్తించామన్నారు. మహిళ శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, జాతరకు వచ్చి అనారోగ్యంతో వారం రోజుల క్రితం మరణించి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహం సమీపంలో నల్లని బార్డర్ గల పికర్ రంగు చీర, గులాబి రంగు జాకెట్టు, ఎర్రటి లంగా, పసుపు తెలు గుగీతలు గల టావెల్, నలుపు ఎరుపు రంగు గల బ్యాగు, బ్యాగులో స్టీలు చెంబు ఉందన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని గుర్తిస్తే పాపన్నపేట ఎస్ఐ విజయ్‌కుమార్‌ను 9440627014కు వివరాలు తెలపాలన్నారు.

## కుల వివక్షతపై కఠిన చట్టాలు తీసుకురావాలి

**ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు**

**గజ్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):**
కుల వివక్షతపై కఠిన చట్టాలు తీసుకురావాలని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు పేర్కొన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో అట్టడుగు వర్గాల విద్యార్థులు ప్రవేశించడాన్ని కుల ఉన్మాదులు జీర్ణించుకోలేకపోతున్నారని, సామాజిక స్పృహలేని కొన్ని ఉన్నత విద్యా సంస్థలు కుల వివక్షత కేంద్రాలుగా మారాయన్నారు. ర్యాగింగ్‌కు జూనియర్ సీనియర్‌ల మధ్య వ్యత్యాసాలకు కులం రంగు పులిమి వేధించడం ఉన్నత విద్యా సంస్థలు, పాలన అధికారులు పాటిస్తున్న అనాగరిక విలువలకు పరాకాష్ట అన్నారు. ఈ నేర సంస్కృతిని పెంచి పోషించిన కాకతీయ మెడికల్ కళాశాల పాలన అధికారులను, సరైన పర్యవేక్షణ చేయకుండా ఏసి గదుల్లో కూర్చొని మెడికల్ కళాశాలల నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన కాళోజి హెల్త్ యూనివర్సిటీ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు.

# ఏడుపాయల్లో అంతా గందరగోళం



ఏడుపాయల దేవస్థానం

**హుండీ లెక్కింపులో సీసీ కెమెరాలు తొలగింపు**
**ఇష్టారీత్యా తాత్కాలిక ఉద్యోగుల నియామకం**
**ఎడమొహం పెడమొహంగా చైర్మన్, ఈవోలు**
**దేవాలయం ప్రతిష్టను దెబ్బతీస్తున్న అధికారులు**
**కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలి**

**సంగారెడ్డి బ్యూరో, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోనే అంత్యంత ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల పుణ్యక్షేత్రంలో గత కొంత కాలంలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. అధికారుల ఒంటెద్దు పోకడలతో భక్తులతో కళకళలాడాల్సిన ఏడుపాయల దేవస్థానం అనేక ఆరోపణలు ఎదుర్కొంటూ నిత్యం పత్రికల్లో కనిపిస్తుంది. టెండర్లు మొదలుకొని వసతి గృహాల పరిరక్షణ, ఉద్యోగుల నియామకంతో పాటు చిరవకు భక్తులు ఎంతో నమ్మకంగా అమ్మవారికి సమర్పించుకునే కానుకలను దోచేస్తూ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల జరిగిన జాతర అనంతరం చేపట్టిన హుండీ లెక్కింపులో ఓ తాత్కాలిక ఉద్యోగి ఏకంగా 50 వేల రూపాయలు తస్కరించి చిక్కిన వైనం అందరికీ తెలిసిందే. అయితే ఇది మొదటి సారి కాదని, హుండీ లెక్కింపులో ప్రతి సారి ఎన్నో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని కొందరు అధికారుల అండదండలతోనే హుండీ నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురవుతున్నట్లు మరికొంత మంది బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ప్రతిసారి ఏదో ఒక అవకతవక బయల్పడటం, తాత్కాలిక ఉద్యోగులపై నెట్టేయడం, కొన్ని రోజులు హడావుడీ తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడుపాయల్లో జరుగుతున్న గందరగోళంపై ప్రభాతవార్త ప్రత్యేక కథనం...

జాతర సమయంలోనే కాకుండా ప్రత్యేక రోజుల్లోనూ భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే పండుగల అనంతరం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టడం సర్వసాధారణం. అయితే హుండీ లెక్కింపులో ఆలయ అధికారులతో పాటు ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొంటారు. అందరి సమక్షంలోనే హుండీ లెక్కింపు జరుగుతున్నట్లు కనిపించినా అధికారులు వెండి, బంగారు ఆభరణాలతో పటు నగదును మాయం చేయడంలో తమ చేతివాటం చూపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు గత కొంత కాలంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించాల్సింది పోయి మొక్కుబడిగా వెబ్ కెమెరాను ఏర్పాటు చేసి హుండీ లెక్కింపును చేస్తున్నారు. దీంతో హుండీ లెక్కింపులో భారీ ఎత్తున అవకతవకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలకు మరింత ఆజ్యం పోసినట్లు అవుతుంది. అంతే కాకుండా లెక్కింపు సందర్భంలో చేతివాటం ప్రదర్శించిన ఎవరి పైనా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పెద్దమొత్తంలో నగదు అపహరణకు గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు సుధీర్ఘ విచారణ చేపట్టడం లాంటి చర్యలకు పాల్పడకపోవడంతో దొంగలు దొంగలు కలిసి ఊరు పంచుకుంటున్నట్లు అందరు కలిసే అమ్మవారి హుండీ దోచు కుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

గ్రేడ్-2 దేవాలయంగా ఉన్న ఏడుపాయ దేవస్థానంలో అర్చక బృందంతో పాటు వివిధ విభాగాలలో ఎండోమెంట్ ద్వారా నియాకమైన అధికారులు ఉన్నారు. అయితే భక్తుల తాకిడి పెరుగున్నట్లు, ఉద్యోగుల సేవలు మరింత అవసరం అన్న కారణంతో ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు తాత్కాలిక ఉద్యోగులను నియమించుకుంటూ పోతున్నారు. స్థానిక ప్రజాప్రతి నిధులు చెప్పారని కొందరు, ఈవో, చైర్మన్ సహకారంతో మరికొంత మంది, చివరికి ఓ జూనియర్ అసిస్టెంట్ కూడా తన అనుచరుడిని తాత్కాలిక ఉద్యోగిగా నియమించడం జరిగింది. ఇలా ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా తాత్కాలిక ఉద్యోగులను నియమించుకుంటూ ఎవరి వర్గాల వారికి వారు ప్రోత్సహిస్తున్నారు. దీంతో తాత్కాలిక విభాగంలో పనిచేసే ఉద్యోగుల వివరాలు సక్రమంగా లేకపోవడంతో ఏవైనా అనుకొని సంఘటనలు నెలకొన్నా వారిపై ఎలాంటి శాఖా పరమైన చర్యలు తీసుకోవడం లేదు. ఆలయంలో భక్తుల అవసరాల కోసం మరింత మంది ఉద్యోగులు అవసరమైతే ఎండోమెంట్ శాఖ నియమ నిబంధనల ప్రకారం తీసుకోవాలి గానీ, ఇలా ఎవరి అనుచరులను వారు పెట్టుకుంటూ పోతే గుడి వారి అడ్డాగా మారుతుందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలోనే ఆరుగురు తాత్కాలిక సిబ్బందిని నియమించారంటే ఉద్యోగ నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరుగుతున్నాయో అన్న సందేహం తలెత్తు తుంది.

ఆలయ అభివృద్ధి జరగాలన్నా, నిధులు సక్రమంగా వినియోగించుకోవాలన్నా ఆలయ ఎగ్జిక్యూటీవ్ అధికారి (ఈవో), ఆలయ చైర్మన్‌ల మధ్య మంచి తత్సంబంధాలు ఉండాలి. అలాంటప్పుడే ఉద్యోగులకు సరైన ఆదేశాలను జారీ చేస్తూ ఆలయ అభివృద్ధికి బాటలు వేయడం జరుగుతుంది. కానీ ఇటీవల చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సాతెల్లి బాలా గౌడ్, ఆలయ అధికారి సారశ్రీనివాస్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటుందని సన్నిహితులు చెబుతున్నారు. ఇద్దరూ ఎడమోహం పెడమొహంగా ఉండటంతో క్రింది స్థాయి ఉద్యో గుల్లోనూ గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒకరితో సన్నిహితంగా ఉంటే మరొకరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు ఆలయ ఉద్యోగులతో పాటు డైరెక్టర్లలోనూ, అర్చక బృందం లోనూ ఈ పరిస్థితులు తలెత్తుతున్నట్లు తెలుస్తుంది. ఇటీవల జాతర ఉత్సవాల ఏర్పాట్లలోనూ చైర్మన్, ఈవోలు ఎవరికి వారుగా వ్యవహరించినట్లు సమాచారం. జాతర ముందు ఈవో, చైర్మన్‌ల తీరుతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆలయ కమిటీ డైరెక్టర్లందరూ స్థానిక ఎమ్మెల్యేతో మొరపెట్టు కున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఏడుపాయల దేవస్థానంలో ఏర్పడుతున్న గందరగోళ పరిస్థితులపై జిల్లా కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయి విచారణ చేప ట్టాలని భక్తులు కోరుతున్నారు. దేవస్థానం టెండర్లలో అవక తవకల నుండి జాతర నిధుల దుర్వినియోగంతో పాటు హుండీ లెక్కింపులో జరుగుతున్న పరిస్థితులపై కలెక్టర్ స్పం దించి ఆలయ ప్రతిష్టను కాపాడాల్సిన అవసరం ఉంది. గతంలోనూ ఏడుపాయ జాతర నిర్వహణలో ఇష్టారీత్యా ఖర్చులు పెట్టడంతో అప్పటి కలెక్టర్ భారతి హోళికేరి కల్పించుకొని బిల్లులను నిలిపివేసిన సంఘటనలు నెలకొన్నాయి.



గోకుల్ షెడ్‌లో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)



ఇంచార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న గిరిజన రైతులు

### భూములపై తమకు
## హక్కులు కల్పించాలి

**గిరిజన రైతుల డిమాండ్**

**పాపన్నపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** తరతరాలుగా వ్యవసాయ భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న భూములపై తమకు హక్కులు కల్పించాలని గిరిజన రైతులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చిత్రీయల తండాకు చెందిన గిరిజన రైతులు సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేట తహీసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు పూనుకున్నారు. రెవిన్యూ కార్యాలయంలో ఇంచార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడుతూ సర్వే నంబర్ 73లో తరతరాలుగా పంటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, 1992 సంవత్సరంలో రెవిన్యూ అధికారులు సర్వే చేసి జీఓ బి/1723/92 భూ హక్కు పత్రాలను అందించారని వారు గుర్తు చేశారు. కొన్ని రోజులుగా అటవీ శాఖ అధికారులు ఆ భూములు తమ శాఖకు చెందినవని, పంటలు సాగు చేసుకోవద్దంటూ అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెవిన్యూ అధికారులు పట్టాలు ఇస్తే అటవీ అధికారులు అడ్డుకోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. రెవిన్యూ అధికారులు స్పందించి తమ భూములపై పెత్తనం చెలాయిస్తున్న అటవీ అధికారులపై చర్యలు తసుకుంటూ తమకు న్యాయం చేయాలని గిరిజన రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థిని ప్రీతి చావుకు కారణమైన సైఫ్ దిష్టిబొమ్మ దహనం

**మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి27 ప్రభాతవార్త:**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మెదక్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థిని ప్రీతి చావుకు కారణమైన సైఫ్‌ని కఠినంగా శిక్షంచాలని డిమాండ్ చేస్తూ నిందితుడి దిష్టిబొమ్మను మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మెదక్ జిల్లా కన్వీనర్ శశికాంత్ మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రంలో దేవాలయాల లాంటి విద్యాలయాల్లో కూడా విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్ భూతాన్ని తరిమివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రీతి సంగటనకు సంబంధించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఇంతటి ఉన్మాదానికి పాల్పడిన సైఫ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. సైక్ సైఫ్‌ను ఉరి తీయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు. ర్యాగింగ్ సాధారణంగా జరిగేదే అని మాట్లాడిన యూనివర్సిటీ కేఎంసీ మెడికల్ కళాశాల యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భానుప్రసాద్, నగర సంయుక్త కార్యదర్శి ఉదయ్, నాయకులు విష్ణు, విజ్ఞాన్, భరత్, రాజేష్, మనోజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రమేష్

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

**పరిష్కరించాలని అధికారులకు అదనపు కలెక్టర్లు సూచన**

**మెదక్ అర్బన్, ఫిబ్రవరి27 ప్రభాతవార్త:**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ రమేష్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 105 వినతలు స్వీకరించారు. ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లకు సంబంధించి 15 వినతలు రాగా, భూ సమస్యలకు సంబంధించి 62 వినతులు, మిగతా 28 వినతులు వివిధ శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. అట్టి వినతులను ఆయా శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యానికి తావివ్వకుండా వినతులను పరిశీలించి తమ పరిధిలో పరిష్కరించగలిగినవి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు విజయశేఖర్‌రెడ్డి, కమలాకర్, రజాక్, రాధాకిషన్, నాగరాజు, విజయలక్ష్మీ, ఆశాకుమార్, కలెక్టర్ ఏవో యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు దారులకు న్యాయం చేయాలి



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి దరఖాస్తు దారులకు న్యాయం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్ అధికారులను అదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. బాధితులు ఎంతో నమ్మకంతో ప్రజావాణికి వచ్చి దరఖాస్తులు చేసుకుంటారని వారికి న్యాయం చేయడం మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్ఓ లక్ష్మీకిరణ్, కలెక్టరేట్ ఎవో అబ్దుల్ రహమాన్, జిల్లాలోని వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎంపి

**రాయపోల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**
గతంలో జరిగిన ఉప ఎన్నికలల్లో ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి గెలిచిన రఘునందన్‌రావు, గెలిచి రెండు సంవత్సరాలు గడుస్తున్న దుబ్బాక నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామానికైన వెయ్యి రూపాయల నిధులైనా మంజూరు చేసాడా.. అని మెదక్ పార్లమెంట్ సభ్యులు, బీఅర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయపోల్ మండల పరిధిలోని పెద్ద అరెపల్లి, లింగారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పెద్ద అరెపల్లి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆనంతరం గ్రామంలో పలు కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు గ్రామ సర్పంచ్ సొంత నిధులు 12 మంది మహిళలకు 60 వేల రూపాయలను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణి చేసారు. ఆనంతరం లింగారెడ్డిపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి, కురుమ, కుమ్మరి సంఘాల భవనాలకు శంకుస్థాపనలు చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే కొత్తపల్లి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి విద్యార్థులకు క్రీడా సామాగ్రిని మరియు యూత్ సభ్యులకు క్రికెట్ కిట్‌ని, వాల్ బాల్‌ని అందజేసారు. ఆనంతరం వారు మాట్లాడుతూ..రైతుల సంక్షేమానికి కేసిఆర్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల నుండి కాలువల ద్వారా చెరువులు, కుంటలను నింపి రైతులకు వ్యవసాయ రంగానికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా గెలిచి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఆయన ద్వారా పైసా పని జరగలేదని అన్నారు. దమ్ముంటే ఎమ్మెల్యే ఎన్నికల ముందు ఇచ్చిన హామిలను నెరవేర్చాల ని, నెరవేర్చకుంటే గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేను నీలదియాలని ప్రజలకు సూచించారు..పని చేసే ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. కేసిఆర్ ప్రభుత్వం అన్ని కుల వృత్తులకు ఉపాధి కల్పిస్తుందని ముఖ్యంగా గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ, మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉచితంగా చేప పిల్లలను అందజేయడం జరుగుతుందన్నారు. వివిధ ప్రాజెక్టుల నుండి వచ్చే కాలువల ఒడ్డుకు గౌడ కులస్తులు ఈత చెట్లను నాటుకొని ఉపాధి పొందవచ్చన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు నిరంతరం ప్రజల కోసమే శ్రమిస్తూ పని చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో దుబ్బాకలో ప్రజలు ఎమ్మెల్యేకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్, జడ్పిటీసీ లింగాయపల్లి యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి, బీఅర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, రైతుబంధు మండల అధ్యక్షులు రేకుల మున్నా, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కరుణాకర్, అమృతబాయి, మన్నె రంగమ్మ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, మద్ద ప్రవిణ్, రామోళ్ల స్వామి, మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ పాల రవీందర్‌గౌడ్, ఉప సర్పంచ్‌లు శ్రీనివా స్‌గుప్తా, ఎక్కల మల్లేశం, నాయకులు రాజిరెడ్డి, పాల రమాగౌడ్, రజినికాంత్, ఆంజనేయులు, ఇప్ప దయాకర్, రామచంద్రంగౌడ్, వెంకటగౌడ్, లచ్చయ్య, మంతూరి యాదగిరి, జాఫార్, షాదుల్లా, రాజు, బాల్‌నర్సింలు, మల్లేశం, నందు, మహేష్ గౌడ్, మురళి, తీగుళ్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

## మెడికో ప్రీతి మృతి కారకులను ఉరి తీయాలి

**కళాశాల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**ఎఐటీఎఫ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వినయ్‌పవర్**

**జహీరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
తెలంగాణలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, గిరిజన విద్యార్థి మెడికో ప్రీతి ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని అభిఖ భారత గిరిజన సమైఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వినయ్‌పవర్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లింగ వివక్ష, కుల వివక్ష ఎంత తీవ్ర స్థాయిలో ఉందో ప్రీతి సంఘటన తేటతెల్లం చేస్తోందని విచారం వ్యక్తం చేశారు. అహంకార దోరణితో పెరిగిన దుర్మార్గుడి అధిపత్యానికి లొంగకుండా తన తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేయడానికి కృషి చేసిన ప్రీతి జీవితానికి మధ్యలోనే అంతం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రీతికి జరిగిన సంఘటను పునరావృతం కాకుండా ఉండేందుకు సైఫ్‌ని నడిబజారులో ఉరి తీయాలని, కళాశాల బాధ్యులను కఠినంగా శిక్షించాలని హితవు పలికారు. ప్రీతి కుటుంబానికి 1 కోటి రూపాయల ఎక్‌గ్రేషియా ప్రకటిం చాలని, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, కళాశా లల్లో మహిళలకు రక్షణ కొరకు ప్రత్యేక పద్ధతులు పాటించాలని వినయ్‌పవర్ హితవు పలికారు.

## రామాయంపేట-సిద్దిపేటరోడ్డు పనులు...పున: ప్రారంభం

**మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్**

రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ః
గత మూడు సంవత్సరాలుగా పలు కారణలతో ఆగిపోయిన రామాయంపేట-సిద్దిపేట రహదారి పనులు సోమవారం నాడు పున:ప్రారంభమయ్యాయి. ఈ సందర్బంగా స్థానిక మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా కరోనా కారణంగా, రాష్ట్ర బడ్జెట్ ఇబ్బందుల్లో ఉన్నందున పనులు కొంత ఆలస్యమయ్యాయన్నారు. మెదక్ ఎమ్మెల్యే ఆదేశాలతో ఐదు కోట్ల రూపాయలు మంజూరు అయినందున ఈరోజు పనులు తిరిగి ప్రారంభించామన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా వివేకానంద సర్కిల్ నుండి ధర్మారం రోడ్డు వరకు ఆగిపోయిన రోడ్డు పనులు ఊపందుకోనున్నాయన్నారు. ఇక క్రమంగా సిద్దిపేట జంక్షన్ నుండి ధర్మారం రోడ్డు జంక్షన్ వరకు డివైడర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. అంతే కాకుండా వివేకానంద విగ్రహం ప్రాంతంలో కొత్తగా పెద్ద మురికికాలువ నిర్మాణం కూడా ఈ పనులలోనే పూర్తిచేస్తామన్నారు. అలాగే మెదక్ రోడ్డులోని 44వ జాతీయరహదారి బ్రిడ్జినుండి మెదక్ చౌరస్తా మీదుగా వివేకానంద సర్కిల్ వరకు పూర్తిస్థాయిలో రోడ్డు డివైడర్‌లతో ఏర్పాటు చేసి ఇరువైపులా పచ్చదనం పెంచుతూ, విద్యుత్ అలంకరణ పనులు మొదలవుతాయని ఆయన తెలిపారు.

### పేదలకు ఉచిత బియ్యం
# అందిస్తున్న ఘనత ప్రధాని మోడీదే

**బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
బిఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని..పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం సైతం ఇవ్వడం లేదని బిజెపి జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని గణేష్‌నగర్, ఇందిరానగర్ కాలనీలో సోవారం ప్రజాగోస-బిజెపి భరోసా కార్యక్రమంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రతి నెల కరోనా సమయం నుంచి నేటీ వరకు ఉచితంగా 5 కిలలో బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత ప్రధాన మంత్రి మోడీదేనని తెలిపారు. సిద్దిపేట పట్టణ అభివృద్ధి పైన పటారం లోన లోటారంగా ఉందన్నారు. బస్తీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి బిజెపి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సిఎం కెసిఆర్ స్వంత గ్రామం చింతమడకలో ప్రతి ఇంటికి రూ.10 లక్షలు ఇచ్చినట్లుగానే సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రజలకు అందరికీ ఇప్పించాలని మంత్రి హరీష్‌రావును కోరారు. బిఆర్ఎస్ సర్కారు పాలనపై అన్ని వర్గాల ప్రజల నిరుత్సహంతో ఉన్నారని ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బిజెపి అధికారంలోకి వచ్చితీరుతుందన్నారు. కెసిఅర్ సర్కారు అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే రాష్ట్ర సర్కారు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్‌రావ్, గుండ్ల జనార్ధన్, గోనె మార్కండేయులు, తొడుపునూరి వెంకటేశం, సంతోష్, శ్రీనివాస్, నరేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను చూపుతున్న దృశ్యం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ క్యాంప్ 2023

## మొదటి జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు

**దుబ్బాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో మంత్రి హరీష్‌రావు ఆశీస్సులతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ క్యాంప్ 2023 మొదటి జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం మాస్టర్ బురాని శ్రీకాంత్ నిర్వహించారు. జిల్లా నుండి సుమారుగా వెయ్యి మందికిపైగా కరాటే విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొని సత్తా చాటారని మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమన్నారు. శరీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలంటే ఆత్మరక్షణ విద్య కరాటే అవసరమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న మంత్రి హరీష్ రావు, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ విజితవేణుగోపాల్ రెడ్డి, బారాస పట్టణాధ్యక్షుడు సంపత్ రెడ్డి, దళిత సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం, కౌన్సిలర్ రియాజుద్దీన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్టర్ల నగేష్, ప్రతాప్ సింగ్, నవీన్ కుమార్, సురేందర్, దుబ్బాక కేజీబీవీ ఎస్ఓ స్వాతి, స్వర్ణలత, పిటి నిషా, భాగ్యలక్ష్మి, జ్యోతిలు పాల్గొన్నారు.

## ప్రీతి కుటుంబాన్ని ఆదుకోవాలి



హుస్నాబాద్‌లో ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

**హుస్నాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరిగానీ, ఎన్‌కౌంటర్ చేసైనా అంతమొందించాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం సైఫ్ దిష్టిబొమ్మను గిరిజనసంఘాల నాయకులు దగ్ధం చేశారు. ప్రీతిది హత్యేనని అంటూ ఆత్మహత్య నాటకమాడారన్నారు. ఈ నేపథ్యంలో ప్రీతి కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. హత్యకు బాధ్యులైన కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఓడితో కుమ్మక్కైన సైఫ్‌ను కఠినంగా శిక్షిస్తేనే ప్రీతి ఆత్మకు శాంతి చేకూరుతుందని వారు అన్నారు, కార్యక్రమంలో ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం జిల్లా అధ్యక్షులు ధరావత్ తిరుపతినాయక్,లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మాలోతు సత్యంనాయక్, అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భుక్య వీరన్ననాయక్, మోతీలాల్‌నాయక్, మోహన్‌నాయక్, లావుడ్య జవహర్‌నాయక్, ముఢావత్ శ్రీనునాయక్, జవహర్‌లాల్‌నాయక్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి :సోలిపేట సుజాత

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**



మహిళలతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకురాలు సుజాత రెడ్డి

అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి గ్రామ ప్రజలను బిఆర్ఎస్ నాయకురాలు సోలిపేట సుజాతరెడ్డి సోమవారం ఆత్మీయంగా పలకరిస్తూ వారి మంచిచెడులు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను పార్టీ పెద్దల దృష్టికెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానన్నారు. ప్రజాసేవకు సోలిపేట కుటుంబం ఎప్పటికి ముందుంటుందన్నారు.కార్యక్రమంలో పాపని సురేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండవెళ్లి ఎల్లారెడ్డికి సన్మానం



బిఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

**దుబ్బాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన గెండవెళ్లి ఎల్లారెడ్డిని గజ్వేల్ బిఆర్ఎస్ సన్మానించారు. గజ్వేల్ పట్టణ 10వ వార్డు బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ గౌడ్, రాజేశం, జంగం వెంకట్ గౌడ్‌లు సోమవారం దుబ్బాక పట్టణంలో కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. అనంతరం మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం కేసిఆర్, మంత్రి హరీష్ రావు, మెదక్ ఎంపి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లా రెడ్డిల సారథ్యంలో జిల్లాలో బిఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశోక్, బట్టి ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా దత్తత ధృవ పత్రాల పంపిణీ

**వికారాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని చిన్న పిల్లలు ఆలనా పాలన కేంద్రం శిశు గృహ ద్వారా వివిధ జిల్లాల ుండి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి పిల్లల ు దత్తత ఇవ్వడంతో పాటు దత్తత ధ్రువపత్రాల ు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగింది. ఇద్దరు మగ పిల్లలు, ఒక పాపను వెస్ట్ బెంగాల్, కేరళ రాష్ట్రాలకు చెందిన దంపతు లకు కలెక్టర్ చేతుల మీదుగా దత్తత ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు లేని తల్లిదండ్రులు కేరింగ్స్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దత్తత తీసుకున్న పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలని, జిల్లాలో దత్తత కోసం ఇతర వివరాలకు జిల్లా కేంద్రంలోని శిశు గృహ కేంద్రాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని లలితకుమారి, బాల రక్ష భవన్ సమన్వయకర్త శ్రీలక్ష్మి, శిశు గృహ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయింపు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సర్కారు నిధులు కేటాయిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ పేర్కొన్నారు. ఘట్‌కేసర్ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆమె పరిశీలించారు. మంచినీటి సమస్య పరిష్కరించాలని టీచర్లు కోరడంతో ఆమె స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిది లోని 7 సర్కారీ పాఠశాలల్లో మనబస్తీ-మనబడిలో భాగంగా శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మిస్తు న్నారని, కిచెన్ షెడ్డు, మూత్రశాలల పనులు చురుకుగా జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపల్ ఏఈ నరేశ్‌కుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్ రాకేశ్, ప్రధానోపాధ్యాయురాలు అనిత, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** చిన్ననిజాంపేటలో త్వరలో భూ సమస్యలను పరిష్కరించుకుందామని దుబ్బాక ఎమ్మెల్యే రఘునంధన్ రావు అన్నారు. సోమవారం అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చిన్ననిజాంపేట గ్రామంలో ప్రజా గోస బిజెపి భరోసా కార్యక్రమంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ కార్యక్రమానికి ముందుగా గ్రామంలో బిజెపి జెండాను ఆవిష్కరించారు.ప్రజలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గ్రామంలో కొన్ని సంవత్సారాల నుండి భూ సమస్యలు ఉన్నాయని, పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరగా వెంటనే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

స్పందించి స్థానిక తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి గ్రామంలో భూ సమస్యల పరిష్కరానికి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి భూ సమస్యలను తీర్చలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యమన్నారు. గ్రామ ప్రజల సహకారంతో రాష్ట్రంలోని దుబ్బాకనియోజకవర్గాని ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పోతరెడ్డిపేట సర్పంచ్ పుట్లగారి శంకర్, మండల బిజెపి అధ్యక్షుడు అరిగె కృష్ణ, బూత్ అధ్యక్షులు శివరాజం, పుదరి నవీన్, ఎన్. రాజం, శక్తి కేంద్రం ఇంచార్జ్ పూదరి నవీన్ కుమార్, నాయకులు ఎస్ఎన్ చారి, బాను ప్రసాద్‌రావు, పల్లె సుదర్శన్, గోపరి యాదగిరి, గ్రామస్తులు మహేష్, పర్శా రాములు, రమేష్ తదిరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి బిజెపి..ప్రజా గోస-బిజెపి భరోసా

### బిజెపి మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడే విక్రమ్‌రెడ్డి

**శామీర్‌పేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ప్రతి ఇంటా బిజెపి కార్యక్రమం కోసం ప్రజా గోస-బిజెపి భరోసా కార్యక్రమాన్ని చేపట్టినట్లు మేడ్చల్ జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు.శామీర్‌పేట మండలం లోని అలియాబాద్ గ్రామంలోని వివిధ బూత్‌ల బిజెపి కార్నర్ మీటింగ్ సంద ర్భంగ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగ పాల్గొన్న జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా గోస-బిజెపి భరోసా కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలను తెలియజేస్తూ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వ దోరణి తీరును ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావటం ఖాయమని, ప్రజలు బిఆర్ ఎస్ ప్రభుత్వంతో విసిగిపోయారని అన్నారు. గ్రామాల్లో బిజెపి పట్ల ఆదరణ పెరిగిందని, బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటా పర్యటించి కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమంను, విధానాలను ప్రజలకు వివరించాలని పి.విక్రమ్‌రెడ్డి సూచించారు. బిజెపి నాయ కులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ బిజెపిని మరింత బలోపే తం చేయటానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయ కులు, మాజీ వైస్ఎంపిపి వంగరి హృదయ్‌కుమార్, జిల్లా నాయకులు ఎం.అ శోక్, మండల బిజెపి అధ్యక్షులు కైర యాదగిరి, మండల ప్రధాన కార్యదర్శి కీసరి నర్సింగ్‌రావు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు మల్యాల మహేశ్, మండల ఉపా ధ్యక్షులు ఎస్.లక్ష్మణ్, బి.శివ, సీనియర్ నాయకులు వివేకానంద, జి.శరత్ కుమార్, కె.బాలకృష్ణ, గ్రామ బిజెపి నాయకులు, బూత్‌ల అధ్యక్షులు, తదిత రులు పాల్గొన్నారు.

**శామీర్‌పేటలో..**

శామీర్‌పేట గ్రామంలో ప్రజాగోస-బిజెపి భరోసా, బిజెపి కార్నర్ మీటింగ్‌ను బిజెపి నాయకులు నిర్వహించారు. దీనికి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు జగన్‌గౌడ్ విచ్చేసి బిజెపిని మరింత బలోపేతం చే యాలన్నారు. దీనిలో మండల బిజెపి అధ్యక్షులు కైర యాదగిరి, జిల్లా నాయ కులు ఎం. అశోక్, మండల ప్రధాన కార్యదర్శి కీసరి నర్సింగ్‌రావు, జిల్లా బిజెవైఎం ఉపాధ్యక్షులు బోయిని శివ, శక్తి కేంద్రాల ఇన్‌చార్జి బోయిని శివ, మండల బిజెపి ఉపాధ్యక్షులు డి.పవన్‌గౌడ్, సీనియర్ నాయకులు కొరివి కృష్ణ, కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి బోయిని రాజు, మండల కార్యదర్శి యాస్కి సాయిగౌడ్, పలువురు నాయకులు, బిజెపి బూత్ అధ్యక్షులు తది తరులు పాల్గొన్నారు.

## కొర్రెములలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

కొర్రెముల గ్రామానికి చెందిన కుర్రీ కలమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 37 వేల 500 రూపాయల చెక్కును సోమవారం గ్రామ సర్పంచ్ వెంకటేశ్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యుడికి అందజేసినట్లు తెలిపారు. బాధితు రాలు కలమ్మ గత కొన్ని రోజుల పాటు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి వైద్యసే వలు పొందగా ఆస్పత్రికి అయిన ఖర్చు నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖా స్తు చేసుకోగా 37 వేల 500 రూపాయలు మంజూరు చేయించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. చెక్కు పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్ గౌడ్‌తో పాటు ఉప సర్పంచ్ కందుల రాజు ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ బోడ్డు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థిని మృతి చాలా బాధకరం

**- వైఎస్సార్టీపీ షాద్‌నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త) :** వైద్య విద్యార్థిని ప్రీతి మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడవటం చాలా బాధకరమైన విషయమని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూన్నామని వైఎస్సార్ టీపీ పార్టీ షాద్ నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం అన్నారు. ఈ మేరకు సోమవా రం ఆయన స్థానిక మీడియాతో ఫోన్లో మాట్లాడుతూ... వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన వారు ఎంతటి వారైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొ ని బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏం జరుగుతుందో ఎవరికి అర్థం కావడం లేదని, బడుగు బలహీన వర్గాలు బతికి బట్ట కట్టగలిగే పరిస్థితి నేడు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వంటి వర్గాల ప్రజలు నేడు బిక్కుబి క్కుమంటూ బతికే పరిస్థితి నెలకొందని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను దించి ప్రజాస్వామ్య సామాజిక న్యాయం చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలని ఆయన అన్నారు. ప్రీతి మృతి పట్ల సిట్టింగ్ జడ్జీలతో విచారణ జరిగింపి దోషులకు కఠిన శిక్షలు పడేవిధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## పడవతయారీతో నీటిలో పయనం ..

**స్వచ్ఛసర్వేక్షన్‌లో అక్కరకురానినీటిసీసాల పడవతయారీతో నీటిలో విహారం**

**హుస్నాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా హుస్నాబాద్‌లోని శ్రీరేణుకా ఎల్లమ్మ చెరువులో పడేసిన ఖాళీ సీసాలను 'ఇన్నోవేషన్'లో భాగంగా ఖాళీసీసాలను జతచేసి చెక్క, ఒకహెచ్‌పి సాయంతో మోటర్‌ను వినియోగించి చెరువులో విహారం చేయించారు. దీంతో రిసైకిలింగ్‌తో పాటు రెడ్యూస్, రెఫ్యూస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా రూపొందించారు. ఈ ఖాళీ నీటిసీసాల పడవ అందరిని ఆకట్టుకుంది.పర్యావరణ ఇంజినీర్ రవి కుమార్ రూపొందించగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత,వైస్‌చైర్మన్ అయిలేని అనితశ్రీనివాసరెడ్డి,కౌన్సిలర్లు కొంకట నళినీరవిందర్,బోజు రమాదేవిరవిందర్,వల్లపు రాజు,హరీష్,కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి, అయూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

**సర్వేక్షణ్ కార్యక్రమంలో పట్టణ అభివృద్ధి నిధులు కేటాయింపు..**

సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశమందిరంలో మున్సిపల్‌చైపర్సన్ ఆకుల రజిత అధ్యక్షతలన సమావేశం నిర్వహించి పట్టణంలోని చెత్తబుట్టలు ప్రజలకు అందించేందుకు గాను 15లక్షలు, ఎల్లమ్మచెరువు వైకుంఠధామంలో శవాల దహనసంస్కారాలకోసం ముక్తిధామం గదిని ఏర్పాటుకు 10లక్షలు,మల్లెచెట్టు చౌరస్తాలో నిర్మిస్తున్న దుకాణ సముదాయాల కాంప్లెక్స్‌లో లిఫ్ట్ సౌకర్యానికి గాను 16లక్షలు కేటాయిస్తూ సమావేశం తీర్మానం చేసింది.



హుస్నాబాద్ ఎల్లమ్మచెరువులో అక్కరకు రాని నీటిసీసాలే

# పారిశుధ్య సిబ్బంది జీతాలు వాడుకున్న ఘనత కెసిఆర్‌కే దక్కింది: ఎంపిపి

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

పారిశుధ్య కార్మికుల జీతాలు వాడుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్‌లో పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు మంజూరు కాకపోవడంతో విధులను బహిష్కరించి సోమవారం ధర్నాకు దిగారు. కార్మికులకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసిస్తూ ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వై. కావేరిలు కార్మికులు చేపిట్టిన ధర్నాకు మద్దతు తెలిపారు. పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు పస్తులు ఉంటున్నారని అన్నారు. కార్మికులకు జీతాలు మంజూరు అయ్యేంత వరకు మద్దతుగా ఉంటామని ఎంపీపీ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్మికశాఖ మంత్రి అయ్యి ఉండి కార్మికులకు జీతాలు మంజూరు కాక ధర్నా చేస్తుంటే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు సర్పంచ్ వై. కావేరి, వార్డు సభ్యుడు మల్లేశ్, బీజేపీ నాయకుడు వై. మశ్చేందర్ రెడ్డి పాల్గొన్నారు.



.అవుశాపూర్‌లో పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు మంజూరు కాకపోవడంతో విధులను బహిష్కరించి ధర్నాచేపట్టగా మద్దతు తెలిపిన ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి

# తపాలా శాఖలో దోపిడీకి యత్నం

**- క్యాష్ కౌంట్ మిషన్ డ్యామేజ్**
**- మండల కేంద్రంలో నిఘా నేత్రాల కరువు**
**- గతంలో ఎస్‌బిఐ,టిజిబి బ్యాంకుల్లో సైతం ఇలాంటి ఘటనలు**
**- నేటికి దృష్టిసారించని అధికారులు**



**బషీరాబాద్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:**

బషీరాబాద్ మండల కేంద్రంలో ప్రధాన కూడాలి వద్ద ఉన్న తపాలా శాఖలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దోపిడికి పాల్పడ్డారు.సోమవారం ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది గమనించి బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి పోస్ట్ ఆఫిసు చుట్టూ పరిశీలించారు.దుండగుడు పోస్టఫీసు పక్కన ఉన్న గోడదూకి వెలుపలికి చొరబడి ఉంటాడని పోస్టఫిసు సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు.దుండగుడు క్యాష్ కౌంట్ మిషన్,ప్రింటర్ దోపిడికి ప్రయత్నించి వాటిని తీసుకెళ్లే క్రమంలో క్యాష్ కౌంట్ మిషన్ చెజారి పడిపోయిందా లేక ధ్వంసం చేశాడ అనే అనుమానం వ్యక్తం చేశారు.కాగా పోస్ట్ ఆఫిస్ నుండి డబ్బులు కానీ ఏ ఇతర వస్తువులు కానీ అపహరణకు గురి కాలేదన్నారు.ఎస్‌పియం ప రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై విచారణ జరిపి దుండగులను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## అలియాబాద్‌లో శ్రీమల్లిఖార్జునస్వామి జాతర

**శామీర్‌పేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

అలియాబాద్ గ్రామంలో సోమవారం శ్రీ మల్లిఖార్జునస్వామి(మల్లన్న) జాతర ఘనంగ జరిగింది. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామంలోని శ్రీమల్లన్న జాతరను పురస్కరించుకుని భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించు కున్నారు. యాదవ సంఘం వారి ఆద్వర్యంలో మల్లన్న జాతర జరిగింది. దీనిలో గ్రామ సర్పంచు జి.కుమార్‌యాదవ్, ఎంపిటిసి సగ్గు శ్రీనివాస్‌యా దవ్‌తో పాటు మండల రైతుబంధు అధ్యక్షులు కె.కృష్ణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రజలు భక్తులు పాల్గొని శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగ ఆలయం వద్ద భక్తులతో కళకళలాడింది. ఒగ్గుకథ, బోనాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పాల్గొని శ్రీమల్లిఖార్జునస్వామిని దర్శించుకున్నారు.

## మార్చి 6న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త) :** వచ్చే నెల 6న రంగారెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించ బోతున్నామని జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగనున్నట్లు జడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

## సోలార్ లైట్ల ఏర్పాటుకు ఎంపికి వినతి

**పెద్దేముల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

పెద్దేముల్ మండలం రెగొండి గ్రామం నుంచి రుక్మాపూర్ రైల్వేస్టేషన్ వరకు సోలార్‌లైట్లు మంజూరు చేయాలని సర్పంచ్ హైదర్ విన్నవించారు. ఈ మేరకు సోమవారం చెవెళ్ళ పార్లమెంటు సభ్యులు రంజిత్‌రెడ్డికి సర్పంచ్ హైదర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ హైదర్ మాట్లాడుతూ రెగొండి గ్రామం నుంచి రుక్మాపూర్ రైల్వేస్టేషన్ వరకు దాదాపు 2 కిలోమీటర్ల దూరము ఉన్నందున రాత్రి వేళలో స్టేషన్ నుంచి గ్రామానికి రావడానికి ఇబ్బందిగా ఉందని అన్నారు. అంతేగాకుంగా రెగొండి చుట్టుపక్కల 10 గ్రామాల ప్రజలు నిత్యం రుక్మాపూర్ రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజల, ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు సోలార్ లైట్ల మంజూరుకు కృషి చేయాలని యంపికి సర్పంచ్ హైదర్ విన్నవించారు.

## విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సైన్స్‌ఫేర్

**తాండూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

విద్యార్థులలో దాగిఉన్న కళానైపుణ్యాన్ని వెలికితీసేందుకు పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ ప్రశాంత్ తెలిపారు. పట్టణంలోని క్రిష్ణవేణి కాన్సెప్ట్ పాఠశా లలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎడ్యూకేషనల్ సైన్స్ ఫేర్‌ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. సోమవారం రెండో రోజు పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎడ్యుకేషనల్ ఫేర్‌ను విద్యార్థులు అదుర్స్ అనిపించారు. విద్యార్థులు వారి వారి మేదస్సుతో సుమారు 270 వరకు వివిద ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల చేసిన ప్రదర్శనలను తిలకించేందుకు పెద్ద ఎత్తున తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి తిలకించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రశాంత్, డైరెక్టర్ సతీష్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీ సేందుకు ప్రతి యేడాది పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. తల్లిదండ్రులు కూడ విద్యార్థులను ప్రోత్సహిం చాలని అన్నారు.

## ఎమ్మెల్యే సాబ్ సే హత్ మిలాయ...!

**బషీరాబాద్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:**

ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి వర్గానికి చెందిన మరో వ్యక్తి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో చేతులుకలిపారు. బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామంలో శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన ఓ విందుకు ఎమ్మెల్యే తండ్రి విట్టల్ రెడ్డి హాజరయ్యారు.ఈ విందులో విట్టల్‌రెడ్డితో పాటు ముఖ్య నాయకుడు మరి కొంతమంది కలిసి విందులో పాల్గొన్నారు.ఈ విషయాన్ని ఆయన సోదరుడు శనివారం నాడు వార్త విలేకరితో తెలిపా రు.గ్రామ అభివృద్ధి పనుల కోసమే ఎమ్మెల్యేతో చేతులు కలిపినట్లు పేర్కొన్నారు.

## పోచారం మున్సిపల్‌లో కంటి వెలుగు

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

పోచారం మున్సిపల్ పరిధిలోని కంటి వెలుగు కార్యక్రమంలో గత 27 రోజులుగా 3548 మంది కంటి పరీక్షలు నిర్వహించినట్లు చైర్మన్ బి. కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని నారాపల్లిలోని 14 వ వార్డులో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ సుర్వీ రవీందర్ గౌడ్‌తో కలిసి చైర్మన్ బి. కొండల్ రెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. వీరిలో 924 మందికి రిడింగ్ గ్లాసెస్ అందజేసినట్లు తెలిపారు. మిగతా 1022 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ త్వరలో ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది పంపిణీ చేస్తారని అన్నారు. కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు.కార్యక్రమంలో కమిషనర్ ఎ. సురేశ్, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్ రవీందర్ గౌడ్, నాయకులు బి. జగన్‌మోహన్ రెడ్డి, బాస్కర్,కార్తీక్, శంకర్ నాయక్, పంగ అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి : కౌన్సిలర్ దేవ

**మేడ్చల్, ఫిబ్రవరి 27. ప్రభాతవార్త :**

విద్యార్థులకు ఇబ్బంది కాకుండ పాఠశాల యాజమాన్యం చర్యలు చేపట్టా లని మేడ్చల్ మున్సిపాలిటిలోని అత్వెల్లిలో గల సెంట్ క్లారెట్ పాఠశాల యాజమాన్యానికి మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ దేవ వినతి పత్రం అందజేశాడు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విదంగా పాఠశాల గేట్‌ను తెరువాలని, అదే విదంగా లోటస్ ఎన్‌క్లేవ్ ముందు నుండి పాఠశాల వరకు సబ్ రోడ్డును ఏర్పాటు చేయాలని సూ చించాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ మాథ్యు, ఫాదర్ అంథ్యు పాల్గొన్నారు.

## చేపలు పట్టడానికి వెళ్లి ఒక వ్యక్తి మృతి

**నర్సాపూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** చేపలు పట్టడానికి వెళ్లి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం ఇబ్రాహీంబాద్ గ్రామంలో ఆదివారంరాత్రి జరిగింది. పోలీసులు,గ్రామస్తుల కథనం ప్రకారం... ఇబ్రాహీంబాద్ గ్రామానికి చెందిన పదంగల్ల అంజయ్య(45) ఆదివారం సాయం త్రం పెద్దచెరువులో చేపలు పట్టడానికి వెళ్లి నట్లు తెలిపారు. అక్కడ చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తున చెరువులో పడి మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య శేకమ్మ, ఒక కూతురుకి పెళ్లి కాగా ఇద్దరు కుమారులున్నట్లు తెలిపారు. మృతుడి భార్య శేకమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

## మహిళపై దాడి

బషీరాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : శనివారం రాత్రి ఓ మహిళా పై దాడి చేసిన సంఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎక్మాయి గ్రామం కొత్త కాలనీలో చోటుచేసు కుంది.ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.మురికి నీరు ఇంటి ముందుకు వస్తుందని,ఇరు ఇళ్లలోని వ్యక్తులు దాడులకు పాల్ప డ్డారు.ఈ గొడవలో ఓ వ్యక్తి మహిళపై చేయి చేసుకోవటంతో బాధిత మహిళ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుప్పుడు శామప్ప పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ పెట్టుకున్న అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శరనమ ,అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగార్,జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్,డిఆర్‌డిఓ కృష్ణన్‌లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచుకోకుండా సత్వరమే పరిష్కరించాలని తెలిపారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 331 దరఖాస్తుల స్వీకరించ డం జరిగింది.అంతకుముందు జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.... ప్రతి జిల్లా అధికారి తన శాఖపై పూర్తి పట్టు సాధించి తమ సిబ్బందితో ప్రభు త్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ ఫలాలు ప్రజలకు అందే విధంగా పని చేయాలని అన్నారు.గత 15 రోజులుగా చేపట్టిన చర్యలు ఫలితంగా పనులలో పురోగతి కనిపిస్తుందని ఇదేవిధంగా అధికారులందరూ టీం వర్క్‌గా పని చేసి పనులలో పురోగతి సాధించి జిల్లాను టాప్ 5 స్థాయిలో ఉంచాలన్నారు.మార్చ్ మాసాంతం వరకు 60 కోట్ల రూపాయల అంచనాల వ్యయంతో కూడిన రోడ్ల నిర్మాణపు పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా యంత్రాంగం తరపున అధికారులకు అవసరమైన పూర్తి సహాయ సహకా రం ఉంటుందని ఆయన అన్నారు.గ్రామస్థాయిలో ప్రజలకు ప్రతి రోజు మంచి సేవలు అందించాలని అన్నారు.పాఠశాలలో మంచి విద్య,అంగన్‌వాడీ కేంద్రాల లో గర్భిణీలు,బాలింతలకు పౌష్టిక ఆహారం,రేషన్ దుకాణాల ద్వారా ఎప్పటికప్పుడు సరుకులు అందించడంతో పాటు పారిశుధ్యం,తాగునీటి సరఫరా అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు.ప్రజలు ప్రజాప్రతినిధులు మీడియా ప్రతినిధులతో మంచి సంబంధాలు ఏర్పరుచుకోవాలని అధికారులకు సూచించా రు.ఎప్పుడు కూడా అధికారులకు తలదించుకునే పరిస్థితి రాకూడదని ప్రజలలో నమ్మకం కలిగించే విధంగా పని చేసి జిల్లాను రాష్ట్రంలోనే టాప్ 5గా నిలపాల న్నారు.30=35 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి రిటైర్మెంట్ అయిన తర్వాత చేసిన మంచి పనులను గుర్తుచేసుకొని సంతృప్తి కలిగేలా ఉండాలని అన్నారు.ఈ అవకాశం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఉంటుందని అన్నారు.ప్రతి రోజు అటెండెన్స్ యాప్‌ను రివ్యూ చేసుకునే బదులు ఇక నుండి అభివృద్ధి పనులపై సమీక్షలు నిర్వహించే స్థాయికి రావాలన్నారు.పని దినాలలో సమయపాలన పాటిస్తూ బాగా పని చేసి,ప్రభుత్వ సెలవు దినాలను సొంత పనులకు వినియోగించుకోవాలని సూచించారు. అధికారులందరూ ఆరోగ్యంగా ఉండేవిధంగా ఆరోగ్య సుత్రాలను పాటిస్తూ ప్రతి రోజు వాకింగ్ చేయాలని సూచించారు. త్వరలో కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు యోగ తరగతులను నిర్వహిం చున్నట్లు కలెక్టర్ తెలియజేశారు.కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దాసరి ప్రశాంత్

## ప్రీతి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
మెడికల్ విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించి.. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ వైద్య విద్యార్థిని ధారావత్ ప్రీతి సీనియర్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందన్నారు. 5 రోజులపాటు పోరాడి హైదరాబాద్‌లోని నిమ్స్ అసుపత్రిలో ఆదివారం రాత్రి కన్నుమూయడం బాధాకరమన్నారు. సీనియర్ వేదిస్తున్నాడని ప్రీతి ఎన్నిసార్లు హెచ్ఓడి, ప్రిన్సిపల్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఇలాంటి యాజమాన్యాన్ని సస్పెండ్ చేయాలన్నారు. ప్రీతి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. ప్రీతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిపై విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో రంజిత్‌రెడ్డి, నవీన్, చందు, రోహిత్, కనకరాజ్, భరత్ పాల్గొన్నారు.

## కోలిగడ్డలో బిజెపి కార్నర్ మీటింగ్


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

**మెదక్ అర్బన్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని కోలిగడ్డ శక్తికేంద్రంలో సోమవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ అసెంబ్లీ కన్వీనర్ ఎక్కలదేవి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, నాయకులు నాగరాజు, ఓబీసీ మోర్చా బక్కవారి శివ, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అవినీతి పాలన నడుస్తుంది

**-బిజెపి నర్సాపూర్ అసెంబ్లి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్**


మాట్లాడుతున్న వాల్దాస్ మల్లేష్‌గౌడ్

**కొల్చారం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అవినీతి పాలన నడుస్తుందని బీజేపీ నర్సాపూర్ అసెంబ్లీకన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని చిన్నఘనపూర్‌లో నిర్వహించిన ప్రజా గోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కమీషన్లు వచ్చే పథకాలను మాత్రమే అమలుచేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కల్వకుంట్ల కుటుంబం లక్షలకోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి పాపగారి రమేష్‌గౌడ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి పల్లె రవికాంత్, పార్టీ మండల అధ్యక్షులు పాతూరి దయాకర్‌గౌడ్, యువ మోర్చా అధ్యక్షులు పంతుల హరీష్, నాయకులు రాంసానిపల్లి అంజాగౌడ్, చిన్నఘనపూర్ బూత్ అధ్యక్షులు జోగిపేట బాబాగౌడ్, మంద మహేష్, సంగాయిపేట్ బూత్ అధ్యక్షులు, నవీన్, శ్రీనివాస్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప కామరతి కళ్యాణం


బీరప్ప కామరతి కళ్యాణోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితారెడ్డి

**కొల్చారం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** కొల్చారం మండలం వై. మాందాపూర్ గ్రామంలో సోమవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాకిటి సునీతాలక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సునితాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ గొల్ల కురుమల ఆరాధ్య దైవం బీరప్ప కామరతి కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం శుభ పరిణామమన్నారు. మహోత్సవంతోపాటు బోనాల ఊరేగింపు,గొర్రెలను గావు పట్టుట, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో ఎంపీపీ కొరబోయిన మంజులకాశీనాథ్, సర్పంచి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచి వీరారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు జనార్ధన్‌రెడ్డి, నాయకులు మల్లాగౌడ్, కాశీ, బీఆర్ఎస్ నాయకులు, గొల్ల కురుమ సంఘం నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డకు పుస్తెలు, మెట్టెల పంపిణీ

**మర్కుక్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** పేదింటి ఆడబిడ్డకు మా వంతుగా పుస్తెమెట్టెలను అందజేసినట్లు ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం అన్నారు. మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన దానబోయిన లక్ష్మి కూతురు నాగేశ్వరి వివాహానికి సోమవారం పుస్తెలు, మెట్టెలతో పాటు నగదు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్‌తోనే మున్సిపల్ అభివృద్ధి : కౌన్సిలర్

**గజ్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** సిఎం కెసిఆర్‌తోనే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని 3వ వార్డు కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మికనకయ్య పేర్కొన్నారు. సోమవారం 3వ వార్డులో సిసి రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి హరీష్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో వార్డు అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, మున్సిపాలిటీ బిఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు కదుల్ల ఎల్లేశం, 3వ వార్డు అధ్యక్షుడు శ్రీరాం మల్లేశం, పెద్దల పోచయ్య, ప్రొద్దుటూరి శ్రీనివాస్, కుర్రె మహేందర్‌రెడ్డి, గుజ్జేటి రాజు, గుండు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ వరలక్ష్మికనకయ్య

# ఎర్ర చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలి

**కొమురవెల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :**
ఐనాపూర్ ఎర్రచెరువు ఎఫ్‌టిఎల్‌పరిధిలో పోసిన మట్టిని తీసేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టి వినతిపత్రం అందజేశారు. అనంతరం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులు, కొమురవెల్లి దేవాలయ పాలక మండలిచైర్మన్ గీస బిక్షపతి, మండల అధ్యక్షుడు గొల్లపల్లి కిష్టయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారి మాట్లాడుతూ ఐనాపూర్ గ్రామ రెవెన్యూపరిధిలోగల ఎర్ర చెరువును ఫామ్‌ల్యాండ్ పేరుతో ఎఫ్‌టిఎల్‌ను అక్రమంగా ఆక్రమించి చెరువును కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. చెరువులోని మట్టిని తీసేవరకు రిజిస్ట్రేషన్ కాకుండా ఆపి చర్యలు తీసుకొని చెరువును కాపాడాలన్నారు. చెరువుపై 287 కుటుంబాలు అధారపడి ఉన్నాయన్నారు. 500 ఎకరాల నీటి పారకం ఉందని తెలిపారు. మిషన్ కాకతీయలో రూ.30 లక్షలతో చెరువులో పూడికతీసి కట్ట మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. కొంత మంది వ్యక్తులు ఎఫ్‌టిఎల్ పరిధిలో మట్టి నింపుతూ చెరువును కబ్జా చేయడానికి కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ఎఫ్‌టిఎల్ దాటి వచ్చి మట్టి నింపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ సంఘం నాయకులు వెంకటి, చీకోటి నరసింహులు, పాశం చంద్రయ్య, అన్నబోయిన నరసింహులు, తేలు పెద్దులు, మల్లం నరిసింహులు, సత్తయ్య, యాదగిరి, నర్సింలు, రమేష్, సాయిలు, రాజు, శంకరయ్య, మల్లేశం, నాగరాజు, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాయలం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఎంపీపీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ**

**శివ్వంపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**
ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ లక్ష్యాన్నిసాధించాలని ఎంపీపీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ అన్నారు. సోమవారం శివ్వంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు, ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారులు సాయి సౌమ్య, సంధ్యలు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ అధ్యక్షులు హరికృష్ణ మాట్లాడుతూ వైద్యులతో పాటు సిబ్బంది సమయ పాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండాచూడాలని వైద్యులను ఎంపీపీ హరికృష్ణ ఆదేశించారు. రోగులకు చికిత్సలు నిర్వహించి నాణ్యమైన మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి, సౌకర్యాల కల్పన కోసం ఉన్నతాధికారులతో చర్చించి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుపతిరెడ్డి, దొంతి సర్పంచి ఫణి శశాంక్‌శర్మ, జిల్లా రైతు సమన్వయ సమితి డైరెక్టర్ బానోత్ రవినాయక్, ఎంపీటీసీ ఆకుల ఇందిర శ్రీనివాస్, వైద్య సిబ్బంది దిగంబర్, వెంకటేష్, రమేష్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిలో ఎంపీపీ హరికృష్ణ, వైద్యాధికారులు

**బాల్య వివాహాలు జరగకుండా చూడాలి**

**శివ్వంపేట, ఫిబ్రవరి27 ప్రభాతవార్త:**
బాల్యవివాహాలు జరగకుండా చూడాలని ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో హరికృష్ణ అధ్యక్షతన ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో అనర్థాలు జరుగుతాయని, మానసికంగా, శారీరకంగా ఎదుగుదల లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలు చదువుకునేలా చూడాలన్నారు.
ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి జరిగితే నగదుతో పాటు కేసీఆర్ కిట్ అందజేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్ర మంలో ఐసీడీవో మండల సూపర్‌వైజర్లు సంతోష, వసుమతి, ఇంచార్జి ఎంపీడీవో తిరుపతిరెడ్డి, వైద్యా ధికారులు సాయిసౌమ్య, సంధ్య, ఏఎస్ఐ శ్రీనివాస్, ఐసీటీఎస్ కోఆర్డినేటర్ నర్సింలు, ఉపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వర్గల్‌లో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ, ఎఫ్‌డిసి చైర్మన్

## పేదింటి ఆడపడుచులకు అండగా సిఎం కెసిఆర్

**-ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**

**వర్గల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** ప్రతి పేదింటి ఆడపడుచులకు సిఎం కెసిఆర్ అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. వర్గల్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద వర్గల్ మండలంలో 11 కోట్లు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్, ఎంపిపి లతారమేష్‌గౌడ్, వైస్ ఎంపిపి కడపల బాల్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు జాలిగామ వెంకటేష్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు ఎల్కంటి సంతోష వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నాగరాజు, ఎంపిడిఓ మేరీ స్వర్ణకుమారి, తహసీల్దార్ సతీష్, వివిధ గ్రామాల లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**అంధత్వ నిర్మూలనకు సిఎం కెసిఆర్ కృషి**

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** సిఎం కెసిఆర్ రాష్ట్రంలో అంధత్వ నిర్మూలనకు కృషి చేస్తున్నారని ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపిపి బాలేషంగౌడ్, సర్పంచ్ లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు పథకంతో పేదవారి కళ్ళలో వెలుగులు నింపి అంధత్వ నిర్మూలన రాష్ట్రంగా తీర్చిదిద్దబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, ఎంపిటిసి కొత్త కవితశ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కారింగుల కిరణ్‌గౌడ్, మండల కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఎక్బాల్, ఇటిక్యాల సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బుద్ద నాగరాజు, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బింగి మల్లేశం, వార్డు సభ్యులు రమేష్, మహేష్, బాల్‌నర్సయ్య, గ్రామ కో-ఆప్షన్ సభ్యుడు గాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు రజిని తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**మర్కుక్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** పేదింటి ఆడబిడ్డల వివాహాలు భారం కాకుండా ఉండేందుకు సిఎం కెసిఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ భాగ్యరేఖతో కలిసి వర్ధరాజ్‌పూర్ గ్రామానికి చెందిన విజయలక్ష్మి, మల్లమ్మ, జానకమ్మలకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హరీష్‌కుమార్, బాలకృష్ణమూర్తి, నర్సింలు, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

## గ్రామాల అభివృద్ధే బిఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**బెజ్జంకి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధే బిఆర్ఎస్ సర్కార్ లక్ష్యమని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తోటపల్లి, వీరాపూర్, లక్ష్మీపూర్, బేగంపేట గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు పలు భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాల అభ్యున్నతే ధ్యేయంగా కుల సంఘాల భవనాలు నిర్మిస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. రూ కోటీ 56 లక్షల నిధులతో తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. మండలంలో ప్రజల మౌలిక వసతుల కల్పనకు రూ.30 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే 90 శాతం సీసీ రోడ్ల నిర్మాణం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.

**బండి సంజయ్ మాట్లాడే పద్దతి మార్చుకోవాలి**

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మాట్లాడే పద్దతి మార్చుకోవాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. సోమవారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల మనస్సు గెలుచుకుంటేనే నాయకుడవుతారే తప్ప ఇతర పార్టీలను దూషిస్తే నాయకుడు ఎన్నటికీ కాలేరని అన్నారు. బెజ్జంకి మండలాన్ని తిరిగి కరీంనగర్‌లో కలుపుతామని వ్యాఖ్యాలు చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. దేశానికి ఆదర్శంగా బిఆర్ఎస్ పార్టీ అవతరిస్తున్న క్రమంలో ప్రజాధరణ చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు లింగాల నిర్మల, కనగండ్ల కవిత,కో-అప్షన్ సభ్యులు పాకాల మహిపాల్‌రెడ్డి, కచ్చు రాజయ్య, బోయినిపల్లి నర్సింగరావు, గన్నమనేని అనితరావు, ముక్కిస తిరుపతిరెడ్డి, చింతలపల్లి సంజీవరెడ్డి, లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్‌గుప్తా,శ్రీనివాస్, శేఖర్‌బాబు, మోహన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

**కొల్చారం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన కొల్చారం మండలం రాంపూర్ గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు కథనం ప్రకారం... కౌడిపల్లి మండలం ముండ్రాయి గ్రామానికి చెందిన గొల్ల ప్రమీల(45)గా గుర్తించినట్లు తెలిసింది. మహిళ మృతదేహం నీటిగుంతలో పడి ఉండటాన్ని గమించిన స్థానికులు పలు అమనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం అటు వైపు వెళ్లిన రైతులు మహిళ మృతదేహన్ని చూసి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహన్ని నీటి గుంతలో నుండి ఒడ్డుకు తీసి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు. ఘటన స్థలాన్ని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సందర్శించి ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ఎలాంటి విచారణ చేపట్టినిదే ఎందుకు మృతదేహన్ని తీసివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేద్దాం

**మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి**

**కోహెడ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాహుల్‌గాంధీ పూర్తిచేసిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర మార్చి 2న హుస్నాబాద్ నియోజకవర్గానికి చేరుకుంటుందన్నారు. యాత్ర అక్కన్నపేట మండలంలోని కట్కూరు క్రాస్ వద్ద నుంచి మధ్యాహ్నం 3.30కి ప్రారంభమై హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు సాగుతుందన్నారు. అనంతరం 5 గంటలకు చౌరస్తాలో కార్నర్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. యాత్రను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మంద ధర్మయ్య, బండిపల్లి నారాయణ గౌడ్, శెట్టి సుధాకర్, బస్వరాజు శంకర్, వరికోలు ఎంపిటిసి బోయిని జయంత్, వకులాభరణం భాను ప్రకాష్, మల్లారెడ్డి, గాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిరెడ్డి, శంకర్, శ్రీనివాస్, రాగుల శ్రీనివాస్, అబ్దుల్ రఫీ, పార్టీశ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

## సైఫ్ దిష్టిబొమ్మ దహనం

**మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం కాకతీయ మెడికల్ కళాశాల విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ని కఠినంగా శిక్షంచాలని డిమాండ్ చేస్తూ నిందితుడి దిష్టిబొమ్మను రాందాస్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మెదక్ జిల్లా కన్వీనర్ శశికాంత్ మాట్లడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్ భూతాన్ని తరిమివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఇంతటి ఉన్మాదానికి పాల్పడిన సైఫ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు.సైకో సైఫ్‌ను ఉరితీయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు. ర్యాగింగ్ సాధారణంగా జరిగేదే అని మాట్లాడిన కేఎంసీ మెడికల్ కళాశాల యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భానుప్రసాద్, నగర సంయుక్త కార్యదర్శి ఉదయ్, నాయకులు విష్ణు, విజ్ఞాన్, భరత్, రాజేష్, మనోజ్, అశోక్ పాల్గొన్నారు.

## రహదారి విస్తరణ పనులు పదిరోజుల్లో పూర్తిచేయాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

**గజ్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** ఇందిరాపార్కు చౌరస్తా నుంచి కోట మైసమ్మ వరకు రహదారి విస్తరణ పనులను పది రోజుల్లో పూర్తిచేయాలని లేనిచో మున్సిపల్ ప్రజల పక్షాన ధర్నా చేస్తామని ఇటీవల చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన పాలకవర్గ సభ్యులు హెచ్చరించారు. అలాగే పనులు ముమ్మరంగా పూర్తిచేయాలని ఆర్డీఓ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ చైర్మన్ ఒంటెద్దు పోకడతోనే ఇందిరా పార్కు చౌరస్తా నుంచి కోటమైసమ్మ వరకు రహదారి విస్తరణ పనులు నత్త నడకన నడుస్తున్నాయన్నారు. నాలుగు వరుసల రహదారి పనుల కోసం కోట్ల నిధులు మంజూరైనా పనులు సాగకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా పేదల ఇళ్లు కూల్చివేశారని, కూల్చివేసిన చోట పనులు కొనసాగకపోవడంతో అటు పేదలు ఇటు ప్రయాణీకులు అవస్థలు ఎదుర్కుంటున్నారన్నారు. సుందరీకరణలో భాగంగా ఇందిరాపార్కు చౌరస్తా అభివృద్ధిని చైర్మన్ పట్టించుకోవడంలేదని ఎందుకంటే ఆ చౌరస్తా సుందరీకరణ అభివృద్ధి పనులు ప్రారంభిస్తే తన సొంత భవనాలు రోడ్డు నిర్మాణంలో పోతాయనే భావనతోనే అభివృద్ధి పనులు జరగనివ్వడంలేదని పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు అభివృద్ధికి సహకరిస్తుంటే చైర్మన్ మాత్రం అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నారని ఆరోపించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని బిఆర్ఎస్ నాయకులు ఏర్పుల మహేష్ అన్నారు. మండల పరిధిలోని గురువన్నపేట గ్రామానికి చెందిన బ్రహ్మండ్లపల్లి పర్శరాములకు సిఎం సహాయనిధి మంజూరు వచ్చిన రూ.25 వేల చెక్కును సోమవారం అందజేసి మాట్లాడారు. బిఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు పార్టీలకతీతంగా పేదలకు సిఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బుడిగె రమేష్‌గౌడ్, దాసరి మచ్చేందర్, సార్ల సురేష్, ఒరుగంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** అపదలో ఉన్న ప్రతి కుటుంబానికి తెలంగాణ వడ్డెర సంఘం, ఛారిటెబుల్ ట్రస్టు అండగా నిలుస్తుందని టి.వడ్డెర సంఘం అధ్యక్షులు, చైర్మన్ శివరాత్రి అయిలమల్లు అన్నారు. మండల పరిధిలోని కొండాపూర్‌లో బోదాసు సుజాత ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో బాధిత కుటుంబానికి సోమవారం టి.వడ్డెర సంఘం, ఛారిటెబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కుంచం శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోదాసు యాదగిరి, తిరుపతి, రవిలతో కలిసి బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి మండల వడ్డెర సంఘం నాయకులు బోదాసు రమేష్, రవికుమార్, సంపంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ భవన్ ఎదుట నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన


విద్యుత్ భవన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ ఐక్యకార్యాచరణ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తాలోగల విద్యుత్ భవన ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి విద్యుత్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పిఆర్‌సితో పాటు ఇతర సమస్యలను పరిష్కరించకుండా మేనేజ్‌మెంట్ కాలయాపన చేస్తుందన్నారు. మేనేజ్‌మెంట్ మొండివైఖరికి నిరసనగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేస్తామన్నారు. టిఎస్‌పిఈజెఎసి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయటానికి సిద్దంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో టిఎస్‌పిఈజెఎసి, కమిటీ చైర్మన్ ఏ.వీరభద్రయ్య, కన్వీనర్ గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎస్ హుస్సేన్, పాండరీ, బాలకిషన్, చంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, స్వామిదాస్, రవిప్రసాద్, కతూబ్ ఉద్దీన్, రమేష్, రామకిష్టయ్య, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల, నియోజక అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**
తల్లిదండ్రులు లేని విద్యార్థులకు రూ.25వేలను వారిపేరుతో ఫిక్సిడ్ డిపాజిట్ చేయనున్నట్లు మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావ్ తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేటలోని బస్టాండ్ నుండి సోమేశ్వరాలయం వరకు తన కుమారుడు డాక్టర్ మైనంపల్లి రోహిత్‌తో కలిసి ర్యాలీగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మైనంపల్లి హనుమంత రావ్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలోని 500 మంది విద్యార్థులకు రూ.25వేల అందించనున్నట్లు ఆయన తెలిపారు. మెదక్ నియోజకవర్గం తనకు రాజికియ బిక్షపెట్టిందని, నియోజవర్గాన్ని అభివృద్ధి చేయాటానికి మైనంపల్లి స్వచ్ఛద సంస్థ కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్చంద సంస్థ చైర్మన్ డాక్టర్ మైనంపల్లి రోహిత్, సర్పంచ్‌లు రాజిరెడ్డి, పోచయ్య, గోపాల్ నాయక్, నాయకులు జీవన్, రంగరవ్, యాదవరావ్, రమేష్‌గౌడ్, సురేందర్‌రెడ్డి,మేడి గణేష్, వివిధ గ్రామాల విద్యార్థులు, తలిదండ్రులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో ఎబివిపి ఆధ్వర్యంలో నిరసన, ర్యాలీ

**నర్సాపూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** వైద్యవిద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏబివిపి ఆధ్వర్యంలో సోమవారం నర్సాపూర్ చౌరస్తాలో శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రీతి కుటంబానికి న్యాయం జరుగాలని మౌనం పాటించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబివిపి విద్యార్థి నాయకులు మాట్లాడుతూ వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో సీనియర్స్ వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, అదేవిధంగా సిట్టింగ్ జడ్జితో మాట్లాడి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబివిపి జాయింట్ సెక్రటరి అక్షయ్‌గౌడ్, టౌన్ సెక్రటరి రాహుల్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ లు సుజిత్‌గౌడ్, వరుణ్, మనోజ్, కార్యకర్తలు రంజిత్,కన్నిగౌడ్,నందుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఏబివిపి నాయకులు.



కంటి వెలుగు శిబిరాన్ని ఎంపిపితో కలిసి ప్రారంభిస్తున్న సర్పంచ్ జయశ్రీరెడ్డి

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**-గంగ్వార్ సర్పంచ్ బెర్ల జయశ్రీనిరంజన్‌రెడ్డి**

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మానవ అవయవాల్లో ప్రధానమైన కండ్లను పరిరక్షించు కోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంటుందని మండలంలోని గంగ్వార్ గ్రామ సర్పంచ్ బెర్ల జయశ్రీ నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గంగ్వర్ గ్రామంలో రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని ఎంపిపి అధ్యక్షులు అంజమ్మతో కలసి సర్పంచ్ ప్రారంభించారు. డాక్టర్ శ్రీదేవి, ఎంపిహెచ్ఓ మల్కాపురం మల్లికార్జున్, నాగభూషణం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చం ద్రప్ప, శ్రీనివాస్, లక్ష్మణ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## అడవి పంది దాడిలో యువకుడు మృతి



మార్చురీలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

**ఝరాసంగం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని అడవిపంది ఢీకొన్న సంఘటనలో వ్యక్తి గా యాలకు గురై ఆస్పత్రిలో చికిత్స అందుకుంటూ తిరిగిరాని లోకాలకు చేరిపోయిన సంఘటన సోమవారం చోటు చేసు కుంది. ఝరాసంగం ఎస్ఐ కథనం ప్రకారం... పోలీసు ఠాణా పరిధిలోని చిలమామిడి గ్రామానికి చెందిన మల్కాపురం సంగన్న (38) తన అన్న కుమారుడు గొల్ల రేమష్‌తో కలిసి వేరు వేరు ద్విచక్ర వాహనాలపై ఈ నెల 24న తమ బంధువుల వివాహ శుభకార్యక్రమంలో పాల్గొనేందుకు టిఎస్ 15 హెచ్ 5262 ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో గ్రామ శివారు లోని సాయిబాబ ఆలయం దాటాక నవ్య వెంచర్ దగ్గర రాత్రి అందాజ 11.30 గంటల ప్రాంతంలో అడవిపంది వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో సంగన్న గాయాలకు గురికాగా వెనుకాలే వస్తున్న అన్న కుమారుడు రమేష్ తన బాబాయిని వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అందించి డాక్టర్ సూచన మేరకు హైద్రాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. హైద్రాబాద్‌లోని అమీర్‌పేట్‌లో గల వెల్‌నెస్ ఆస్పత్రిలో చికిత్సలు అందు కుంటూ సోమవారం ఉదయం తిరిగిరాని లోకాలకు చేరిపో యాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## పేదల ప్రకృతి బడి తారా కళాశాల



తారా డిగ్రీ కళాశాలల సక్సెస్ మీట్ నిర్వహిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థుల సక్సెస్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి హాజరై విద్యార్థులను, కళాశాల బాధ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాలలో విద్యను అందుకుని స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు కళాశాల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించాలని వినతి చేశారు. పిజి ఎంట్రన్స్‌లో, రిపబ్లిక్ పేరేడ్ క్యాంపుల్లో, జాతీయ సమైఖ్యతా శిబిరాలల్లో కళాశాల విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. 2018 సంవత్సర ంనుంచి నేటి వరకు కళాశాల నుంచి అంతర్జాతీయ, జాతీయ కార్యక్రమాల్లో కళాశాల తరఫున పాల్గొని కళాశాలకు గుర్తింపు తెచ్చారని విద్యార్థులను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం, ఐక్యాక్ కన్వీనర్ ఏవి శర్మ, పూర్వ విద్యార్థి మహ్మద్ సర్దార్, ఎన్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టరన పద్మజ, డాక్టర్ అభిజిత్, డాక్టర్ సిద్దులు, శివదీప్తి, డాక్టరన విజయ, మనోజ్ కుమార్, అధ్యా పకు లు శ్రావణి, అన్నపూర్ణ, సర్దార్ జ్యోతి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## 10 విద్యార్థులకు అభ్యాసన దీపికలు పంపిణీ



విద్యార్థులకు అభ్యాసన దీపికలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**చౌటకూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యను అర్జిస్తున్న 10వ తరగతి విద్యార్థులకు అభ్యాసన దీపకలు పంపిణి చేశారు. మండలంలోని శివంపేట, సుల్తాన్‌పూర్, బొమ్మరెడ్డి ఆశ్రమ పాఠశాలను మండల విద్యాధికారి డి అంజయ్య పరిశీలించారు. ఆయా పాఠశాలలో 10వ తరగతిలో విద్యను అందుకుంటున్న విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, గణితం, సాంఘీక శాస్త్రాలకు సంబంధించి కరదీపికలు పంపిణి చేశారు. కరదీపికలతో విద్యార్థులు ప్రయోజనం అందుకునే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎర్రోళ్ల ప్రభాకర్, మురళీకృష్ణ, సిద్ధారెడ్డి, రాందాస్, సిఆర్‌పిలు ఆంజనేయులు, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

## నిరుపేద వధువు వివాహానికి పుస్తెమెట్టెలు అందజేత

**రామాయంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ః**

రామాయంపేట పట్టణానికి చెందిన నిరుపేద వధువు వివాహానికి ప్రముఖ సంఘ సేవకుడు ఎర్రం ఆంజేనేయులు అండగా నిలిచారు. పట్టణానికి చెందిన ముత్తరగళ్ల శ్యామల-యాదగిరి దంపతుల కుమార్తె మేఘన వివాహానికి పుస్తెమెట్టెలు బహుకరించారు. సోమవారం నాడు స్థానిక పెద్దమ్మ దేవాలయం వద్ద జరిగిన వివాహ మహోత్సవానికి వెళ్లిన ఎర్రం అంజనేయులు-నాగలక్ష్మి దంపతుల చేతుల మీదుగా వధువుకు పుస్తెమెట్టెలు అందజేసి ఆశీర్వదించారు. మండల పరిధిలో ఇప్పటివరకు 105 మంది వధువు వివాహాలకు పుస్తెమెట్టెలు అందించినట్లు ఎర్రం అంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రొయ్యల పోచయ్య, రొయ్యల కిషన్, పోచమ్మల కిషన్, కర్రెనరేందర్, గంగరి పోచయ్య, పెంటమీద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానందజీ మహారాజ్‌ను దర్శించుకున్న సునీతారెడ్డి



సదర్గురు ధామ ఆశ్రమంలో శ్రీ కృష్ణానంద జీ మహారాజ్‌ను దర్శించుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 27 .ప్రభాతవార్త:.**

హిమాలయాలకు చెందిన సిద్దయోగి శ్రీకృష్ణానందజీ మహారాజ్ అధ్వర్యంలో సద్గురు ధామ ఆశ్రమం చిప్పల్‌తుర్తిలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో బాగంగా హవాన్ పూజ బ్రహ్మదీక్ష శ్రీరామ్ కథ,సద్గురు అమృతవాణి వంటి కార్యక్రమాల్లో శ్రీ కృష్ణానంద జీ మహారాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ ఈఉత్సవాల్లో బాగంగా సోమవారం సద్గురు ధామ ఆశ్రమంలో శ్రీ కృష్ణానంద జీ మహారాజ్‌ను రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి దర్శించుకున్నారు . సద్గురు ధామ ఆశ్రమం చిప్పల్‌తుర్తిలో మూడు రోజుల పాటు జరుగనున్న ఉత్సవాల్లో బాగంగా రెండవరోజు సోమవారం రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి ఆశ్రమానికి చేరుకొని సిద్దయోగి శ్రీ కృష్ణానందజీ మహారాజ్ ను దర్శించుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూనర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్‌తుర్తిలో సద్గురు ధామ ఆశ్రమం ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం చాలా అబినందనీయమని అన్నారు. కబీర్ సేనా రాష్ట్ర అధ్యక్షులు చత్రు నాయక్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు చాల బాగున్నాయని ఆయనను అభినందించారు. కబీర్ సేనా రాష్ట్ర అధ్యక్షులు చత్రునాయక్ అధ్వర్యంలో భక్తులకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసి సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయగా భక్తులు ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. ఈ ఉత్సవాలకు చిప్పల్‌తుర్తి గ్రామంతో పాటు పరిసరా గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలోరాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి ,కబీర్ సేనా రాష్ట్ర అధ్యక్షులు చత్రునాయక్ తో పాటు గ్రామ సర్పంచ్ శ్యామల లక్ష్మణ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపిటిసీ సంధ్యరాణి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, నాయకులు సత్యంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ సామ్యానాయక్, నర్సింగ్‌నాయక్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిపి కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన హర్షద్‌కు నియామకప్రతం అందచేస్తున్న అధికారులు

## ఎంపిపి కో-ఆప్షన్ సభ్యులుగా హర్షద్ జమా పటేల్

**జహీరాబాద్(మొగుడంపల్లి), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులుగా మండలంలోని మాడ్గి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హర్షద్ జమాపటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ నియామక పత్రాన్ని అందచేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కో-ఆప్షన్ కొరకు సభ్యని ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరఫుక హర్షద్ జమా పటేల్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నికల ఏకగ్రీవం అయినట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఆర్ స్వప్న, ఎంపిడిఓ మహేష్‌లు ప్రకటించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన హర్షద్ జమా పటేల్‌ను ఎంపిపి అధ్యక్షులు ప్రియాంక గుండారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్సుద్, నాయకులు గుండారెడ్డి, రామచందర్, ఎండి ఖాజా శుభాకాంక్షలు తెలిపారు.

## మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌గౌడ్



గౌడ జన హక్కుల పోరాట సమితీ మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన చంది శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందిస్తున్న మోకు దెబ్బ జాతీయ నాయకులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 27 .ప్రభాతవార్త:.**

గౌడ జన హక్కుల పోరాట సమితీ మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గా నర్సాపూర్ పట్టణానికి చెందిన చంది శ్రీనివాస్‌గౌడ్ నియామకం అయ్యారు. ఈ మేరకు హైద్రాబాద్ లోని గౌడ జన హక్కుల పోరాట సమితీ మోకు దెబ్బ కార్యాలయంలో మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు అమర వేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రటరి జనరల్ రాగుల సిద్ధిరాములుగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాల్‌రాజు గౌడ్ లు కలిసి నర్సాపూర్‌నకు చెందిన చంది శ్రీనివాస్‌గౌడ్ ను గౌడ జన హక్కుల పోరాట సమితీ మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గా నియమిస్తు నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గానియమితులైన చంది శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల సంక్షేమం కోసం, కల్లు గీతా కార్మికుల సమస్య లపై ఉధ్యమించి పోరాడి సమస్యల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. తమ కులస్తులకు మరింత సేవలు అందించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి వాటిని పరిష్కరిస్తానని వెల్లడించారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు కాగా తనను గౌడ జన హక్కుల పోరాట సమితీ మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గా నియమించినందులకు మోకు దెబ్బ జాతీయ నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

### జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్‌లో...

## రామాయంపేట విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన కరాటే విద్యార్థులు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ః**

ఉమ్మడి మెదక్ జిల్లాలో మొట్టమొదటిసారి నిర్వహించిన జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్‌లో రామాయంపేటకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ రొయ్యల హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం నాడు సిద్దిపేటలోని మార్కెట్ కమిటీలో మంత్రి హరీష్‌రావు ప్రారంభించగా నిర్వహించిన ఈ పోటీలలో రామాయంపేటలోని పలు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు 43 మంది పాల్గొనగా అందులో 37 మంది విద్యార్థులు బహుమతులు పొందినట్లు ఆయన తెలిపారు. ఇందలో 21 మంది బంగారు పతకాలు, 8 మంది వెండి పతకాలు, 8మంది కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈమేరకు పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి కరాటేలో మెలకువలు నేర్పించిన మాస్టర్ రొయ్యల హరిప్రసాద్‌తో పాటు బ్లాక్ బెల్ట్ మాస్టర్స్ రామకృష్ణ, సంపత్‌కుమార్‌లను మంత్రి హరీష్‌రావుతో పాటు రెజ్యూంకి ఇండియా చీఫ్ మాస్టర్ నగేష్ మాస్టర్, రామాయంపేట మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్, స్థానిక సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పురప్రముఖులు అభినందించారు.



కేతకి ఆలయానికి లేగదూడలను బహూకరిస్తున్న హర్యానా రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్ శెట్టి ఉదయ్‌కుమార్

## కేతకి ఆలయంలో సుప్రీంకోర్టు న్యాయవాది పూజలు

**ఆలయానికి బహూకరించిన 2 లేగదూడలు**

**ఝరాసంగం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** దక్షిన కాశీగా పార్వతీ దేవి సమేతంగా నిత్యపూజలందు కుంటున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయాన్ని హర్యానా రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్, సుప్రిం కోర్టు న్యాయవాది శెట్టి ఉదయకుమార్ సాగర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉదయకుమార్ సాగర్ కుటుంబ సభ్యులను ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పాద ప్రక్షాళన చేసుకుని ఆలయ గర్భ గుడిలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తమ మొక్కుబడిలో భాగంగా ఆలయానికి రెండు లేగ దేడులను బహుకరించారు.

### దత్తగిరి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

శ్రీకేతకి ఆలయంలో పూజా కార్యక్రమాలు ముగించుకుని మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి ఆశ్రమానికి చేరుకోగా ఆశ్రమ మర్యాదలతో న్యాయవాది కుటుంబానికి స్వాగతం పలికారు. ఆశ్రమంలోని ద్వాదశజ్యోతిర్లింగాలను, పంచ వృక్షాలను, శనేశరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీ108 వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది అభయకుమార్‌సాగర్, జహీరాబాద్ న్యాయస్థానం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ సాగర్, నాగు సాగర్, రవి సాగర్, కొత్తూర్ గొల్ల భాస్కర్ యాదవ్, శివకుమార్, మాచ్‌నూర్ మాజీ సర్పంచన వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో పలువురి చేరిక



మురళీయాదవ్ ఆధ్వర్యంలో బిజెపిలో చేరిన నవాబ్‌పేట గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 27 .ప్రభాతవార్త:.**

నర్సాపూర్‌లో సోమవారం బిజెపి పార్టీలో పలువురు నాయకులు చేరారు. నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్ అధ్వర్యంలో హత్నూర మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు నర్సా పూర్ లో మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్బంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు బిజెపి పార్టీలో చేరిన వారు నవాబ్‌పేట గ్రామానికి చెందిన వార్డు సభ్యులు జక్కుల పాండు, నాయకులు జక్కుల నారాయణ, శ్రీశైలం, మల్లేష్, శివ. బీరప్ప, మహేశ్, మల్లేష్, గణేశ్, వీరేశ్, యాదాగౌడ్, నారాయణ, నర్సింలు, నరేశ్, కృష్ణ, రవి, రామ్, రుక్మేశ్, రమేశ్ తదితరులు చేరారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్ తో పాటు హత్నూర మండల బిజెపి అధ్యక్షులు నాగప్రభుగౌడ్, నర్సాపూర్ కౌన్సిలర్‌లు, రాజెందర్, బుచ్చేష్‌యాదవ్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, హత్నూర బిజెపి నాయకులు ఎర్ర సతీష్‌యాదవ్, కొలని రవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు రాక... పారిశుధ్య కార్మికులు బిక్షాటన

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ః**

రామాయంపేట మండల పరిధిలోని కోనాపూర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సోమవారం నాడు వారంతా గ్రామంలోని పలు దుకాణాలతో పాటు పలువురి వద్ద బిక్షాటన చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నిత్యం మురికికాలువలు శుభ్రం చేస్తూ, రోడ్లు ఊడుస్తూ గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న మాకు 4 నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలి చాలని బతుకులు వెల్లదీస్తున్న తమకు వచ్చే కాస్త జీతం కూడా రాకపోవడంతో పూట గడవడం కూడా కష్టతరమవుతుందన్నారు. ప్రజాప్రతినిదులు, అధికారులు స్పందించి తమకు జీతాలు ఇప్పించాలని వారు కోరారు. కాగా కోనాపూర్‌లో పంచాయతీ పారిశుధ్య కార్మికులు బిక్షాటన చేయడంపై గ్రామంలో పలువురు పంచాయతీ పాలకవర్గం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సిద్దరాములు కార్మికులకు తనవంతుగా డబ్బులు ఇచ్చి సహాయం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి స్వగ్రామంలోనే ఇలా పారిశుధ్య కార్మికులు బిక్షాటన చేసే పరిస్థితి ఉందంటే, మరి ఇతర గ్రామాలలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. ప్రజాప్రతినిధులు ప్రతినెల జీతాలు తీసుకుంటున్నారని, కాని పాచి పనులు చేసే పారిశుధ్య కార్మికులకు 4 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైన గ్రామ పంచాయతీ సర్పంచ్ మరియు పాలకవర్గం కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



బిక్షాటన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

## నేడు డయల్ యువర్ ఆర్ఎం

**సంగారెడ్డి, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:**

తెలంగాణ ఆర్టీసి అందిస్తున్న సేవలపై ఇంకా ఏమైె సందేహాలు ఉంటే ఈనెల 28న ఉదయం 11గంటల నుండి 12గంటల వరకు డయల్ యవర్ రీజినల్ మేనేజర్ కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి,మెదక్,సిద్దిపేట జిల్లాల ప్రజలు తమ సమస్యలను 8500376267 తెలియజేయవచ్చునని అన్నారు. దీనితో పాటు ఆదేరోజు సాయంత్రం 4గంటల నుండి 5 గంటల వరకు సంగారెడ్డిజిల్లాలోని ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 8500376267కు ఫోన్ చేయవచ్చునని డిపో మేనేజర్ పి. ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సంగారెడ్డిలో ఘనంగా సైన్స్‌దినోత్సవం




సైన్స్ దినోత్సవంలో పాల్గోన్న విద్యార్థులు,ఉపాధ్యాయులు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:**

సంగారెడ్డి పట్టనంలోని సెయింట్ అంథోనీస్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సం,ఎస్ఎల్‌సి 2 కార్యాక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ కరుణాకర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి,సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలు వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్‌ను ఉపయోగించుకుంటే పురోగతి ఉంటుందని, సరిగ్గా ఉపయోగించకుంటే అవుతుంది అదోగతి అన్నారు. రెండు రోజుల పాటు కార్యాక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆయా విషయాలపై విద్యార్థులు నిర్వహించిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కరుణాకర్‌రెడ్డితోపాటు వైస్ ప్రిన్సిపల్ ఈ. ఆరుణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెచ్ జయబాలరెడ్డి, ఆకాడమిక్ డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి, విధ్యార్థిని, విద్యార్థుల తల్లి,తండ్రులు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గోన్నారు.

## గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:**

హత్నూర మండలం కాసాల గ్రామంలో సోమవారం గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను సంబంధిత అధికారులు వేశారు. కార్యామ్రాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి హేమలత,జెవిఓ భాగ్యలక్ష్మి,స్థానిక బిఆర్ఎస్ నాయకులు రామచంద్రారెడ్డి, లక్షినారాయణ, జైపాల్, నాగయ్య తదితరులు పాల్గోన్నారు.

## వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ



వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమీపూజ చేస్తున్న నాయకులు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:**

హత్నూర మండలం సికింద్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సోమవారం భూమీ పూజ నిర్వహించారు. కార్యక్రమానికి హత్నూర మండల పరిషత్ అధ్యక్షులు వి.నర్సింలు ముఖ్యఅతిథిగా హజరై భూమీ పూజ చేవారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగేనీటి ఇబ్బందిని గుర్తించిన శాసనస భ్యులు మదన్‌రెడ్డి గ్రామానికి ఆదనపు వాటర్ ట్యాంక్‌నిర్మాణా నికి నిధులు మంజూరు చేశారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మానిక్‌రెడ్డి, జడ్పీటిసి అంజనేయులు, ఎంపిటిసి. కౌడిపల్లి వెంకటయ్య, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ కౌ డిపల్లి యాదగిరి, మాజీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు బడంపేట బుచ్చిరెడ్డి, దుర్గారెడ్డి, కిషోర్, రామగౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## ప్రీతి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

**ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రశాంత్**



రోడ్డుపై బైఠాయించి నిరసన చేపడుతున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ః**

వైద్య విద్యార్థిని ప్రీతి మరణానికి కారణమైన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రామాయంపేట నగర కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. సోమవారం నాడు పట్టణంలోని ఆయా కళాశాలల విద్యార్థిని, విద్యార్థులతో కలసి రోడ్డుపై బైఠాయించి శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. మానవహారం ఏర్పాటుచేసి మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతి పట్ల న్యాయం జరగాలని మౌనం పాటించి ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో సీనియర్ విద్యార్థుల వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని ప్రీతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా నిందితుడుపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణకు షీటీమ్‌లు ఉన్నా, ప్రీతిని రక్షించుకోలేకపోయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సంయుక్త కార్యదర్శి సంపత్, ప్రత్యూష్, మహిళా కన్వీనర్ అమృత, ఎస్ఎఫ్‌డి కన్వీనర్ నరేష్, కార్యకర్తలు గణేష్, సాయి, రేవంత్‌తోపాటు ఆయా కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి బదిలీ

**నూతన కమిషనర్‌గా సంపత్‌కుమార్ నియామకం**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దిపేట మున్సిపల్ కమిష నర్‌గా విధులు నిర్వహిస్తున్న రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. గత కొంత కాలంగా మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన రవీం దర్‌రెడ్డిని తన స్వంత శాఖ రెవెన్యూకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న సంపత్‌కుమార్‌ను సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.